క్లుప్తంగా

బీజామృతంతో విత్తనశుద్ధి ఎంతో మేలు



హరిపాలెం ఆర్‌బీకే వద్ద బీజామృతంతో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తే ఎటువంటి దుష్ప్రభావం లేని ఆహారోత్పత్తి జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హిమసుందర్ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన వరి నారుని పెంచుకోవాలని సూచాంచారు. దీంతో పంటకు ఎటువంటి పురుగులు, తెగుళ్ల సోకవని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాయుడుబాబు పాల్గొన్నారు.


పర్యావరణాన్ని కాపాడుకుందాం



చినబొడ్డేపల్లిలో మొక్కలు అందజేస్తున్న సర్పంచ్ శివరాం

కోటవురట్ల : పండ్ల మొక్కల పెంపకంతో ఆదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని సర్పంచ్ పైల శివరాం అన్నారు. చినబొడ్డేపల్లి గ్రామంలో శనివారం గ్రీన్ మిలీనియం కార్యక్రమం నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం పరిధిలోని 34 డ్వాక్రా సంఘాల సభ్యులకు 250 మొక్కలు అందించామని, ఇందులో కొబ్బరి, నిమ్మ, జామ, బత్తాయి. సపోటా, చింత, సీతాఫలం, మామిడి, జీడి మామిడి మొక్కలు ఉన్నట్టు తెలిపారు.

రేవుపోలవరంలో అలల ఉధృతి



తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ఎస్.రాయవరం : అల్పపీడన ప్రభావంతో మండలంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రేవుపోలవరం తీరంలో సముద్ర కెరటాలు ఎగసి పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. వర్షాల ప్రభావం ఎక్కువై కెరటాలు తీవ్రత ఎక్కువైతే మత్స్యకారులు కొన్ని రోజుల పాటు చేపలవేట నిలిపి వేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



నాగసాయి భార్యకు రూ.10 వేలు అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : లింగాలకాలనీకి చెందిన ధన్యంరాజు నాగసాయి మృతితో ఆయన భార్యకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ. లక్ష మంజూరు కాగా తక్షణ సాయంగా రూ.10 వేలు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అందించారు. మిగిలిన నగదు ఆమె బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని సచివాలయ సిబ్బంది తెలిపారు. జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, వార్డు సభ్యులు మోహన్, మహేష్, సచివాలయ సిబ్బంది లక్ష్మి, వలంటీర్ ప్రమీలారాణి పాల్గొన్నారు.

తేలికపాటి చినుకులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం తేలికపాటి చినుకులు పడ్డాయి. ఆకాశం దట్టంగా మేఘావృతమైనప్పటికీ తేలికపాటి చినుకులే పడ్డాయి. వర్షం పడితే ఇప్పటికే విత్తనాలు వేసిన పొలాల్లో ఆయా విత్తనాలు మొలకెత్తే అవకాశాలున్నాయని రైతులు పేర్కొన్నారు.

జగనన్న పాలనలోనే అందరి సంక్షేమం

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- ధర్మవరంలో జగనన్న సురక్ష



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి సురక్షితంగా అందుతున్నాయని యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. శనివారం యలమంలిలి మున్సిపాలిటీలో ధర్మవరం వార్డులో కనకమహలక్ష్మి ఆలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పలువురు లబ్దిదారులకు ధ్రువపత్రాలు అంతజేశారు. వార్డులో 828 మంది వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పక్క అభివృద్ధి మంత్రంతో దూసుకుపోతుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వలంటీర్లను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. వలంటీర్ల సేవలతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అసూయతో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ, వారి సమస్యలు తెలుసుకుని సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల్లో ప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే వాటిని చెత్త బుట్టలో వేసేవారని, మండల తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజలు తమ అర్జీల పరిష్కారానికి పడిగాపులు కాయవలసి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్దిదారులకు వెను వెంటనే అర్జీలు పరిశీలించి సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, కౌన్సిలర్‌లు కొఠారు కొండబాబు, డాక్టర్ త్రినాథ్, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలే బాబు, పవన్‌కు గుణపాఠం చెబుతారు

మునగపాక : మహిళలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు గట్టి గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. మహిళా పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారన్నారు. మండలంలోని టి.సిరసపల్లి, వెంకటాపురం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులై ఉండి ఇంతవరకు ప్రభుత్వ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ సేవలందిస్తున్న వలంటీర్లను అభినందించాల్సింది పోయి బాబు, పవన్‌లు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని తద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ ఆడారి పొలిమేర గణేష్, పార్టీ నేతలు మద్దాల నాగప్పారావు, బొడ్డేడ జగ్గారావు, మద్దాల జగ్గారావు, డీఎల్‌డీవో మంజలావాణి, తహసీల్దార్ ప్రకాశరావు, ఎంపీడీవో మన్మథరావు, వెంకటాపురం సర్పంచ్ నీలకంఠస్వామి, సిరసపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి అన్నదానం



ఉపమాక ఆలయంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వరుసగా రెండో శనివారం అన్న దానం కార్యక్రమం ఘనంగా జరిగింది. కరోనా కారణంగా రెండేళ్ల పాటు నిలిపివేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ చొరవతో దాతల సహకారంతో తిరిగి గతవారం పునఃప్రారంభించారు. గతవారం స్వామివారి దర్శనానికి వచ్చిన సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ శనివారం సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ప్రధానార్చకులు ప్రసాద్ తెలిపారు. ఇటీవల శని, ఆదివారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, పులిహోర ప్రసాదంతో పాటు, ప్రతి శనివారం అన్నసమారాధన నిర్వహించాలని నిర్ణయించినట్టు ప్రసాద్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీసపాటి వేంకట నర్సింహచార్యులు, ఎన్‌సీహెచ్ శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు పాల్గొన్నారు. శనివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన వేణుగోపాలస్వామి సన్నిధిలోను, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన స్నేహితులు



ఇంటికి చేరిన సురేష్‌ను పరామర్శిస్తున్న స్నేహితులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కష్టాల్లో ఉన్న స్నేహితుణ్ని కాపాడుకోవడంలో అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 2004 బ్యాచ్ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. ఇదే బ్యాచ్‌లో పదో తరగతి చదవి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న అమరపిన్ని సురేష్ కొద్ది వారాల క్రితం విద్యుత్ షాక్ గురై ఆస్పత్రిలో చేరాడు. కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించే సురేష్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు సైతం అతని కుటుంబీకులు ఇబ్బందికి గురయ్యారు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు అప్పట్లో రూ.71 వేలు సమకూర్చి వైద్య పరీక్షల నిమిత్తం అందజేశారు. దీనికి తోడు సురేష్ దీనస్థితిపై సోషల్ మీడియా వేదిక ద్వారా పలువురి సాయం కోరాగా పలువురు దాతలు సైతం సురేష్‌కు అండగా నిలిచారు. విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చిక్సిత పొంది కోలుకున్న సురేష్ శనివారం ఇంటికి చేరుకున్నారు. అతనిని స్నేహితులు పరామర్శించి, తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పీజీ సెట్‌లో స్పేసెస్ విద్యార్థుల ఘనత



కె.రేష్మ | ఎస్.శృతి | పార్థసారథి | వరప్రసాద్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. కెమిస్ట్రీ విభాగంలో కె.రేష్మ 5వ ర్యాంకు, ఎస్.శృతి 32వ ర్యాంకు, జువాలజీ విభాగంలో ఈ.పార్థసారథి అయ్యంగార్ 52వ ర్యాంకు, ఎలక్ట్రానిక్ విభాగంలో ఎస్.ఎస్.డి.వరప్రసాద్ 42వ ర్యాంకు, కంప్యూటర్స్ విభాగంలో కె.సౌమ్య 51వ ర్యాంకు, సైకాలజీలో అంబటి ఆదిత్య నాగ లహరి 66వ ర్యాంకు, లైఫ్‌సైన్స్ విభాగంలో టి.సౌజన్య 128వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఆమా విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు, డిపార్ట్‌మెంట్ హెడ్, అధ్యాపక బృందం అభినందించారు.

శ్మశానవాటికకు రూ.5 లక్షలతో రోడ్డు



నాగవరం శ్మశానవాటిక రహదారి

మునగపాక : కొత్త నాగవరం శ్మశానవాటిక సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఈ శ్మశానవాటికి సరైన రహదారి లేకపోవడంతో మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు తదితరులు అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి దృష్టికి తీసుకురావడంతో ఆమె రహదారి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. పంచాయతీరాజ్ ఏఈ చంద్రశేఖర్ పర్యవేక్షణలో రహదారి పనులు చేపట్టారు. దీంతో పాటు గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన రూ.7.5 లక్షల నిధులతో పాతనాగవరం రామాలయం నుంచి శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. దీంతో పాత, కొత్త నాగవరం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మలాడలో జగనన్న సురక్ష సర్వే



ఉమ్మలాడలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శంకర్

మునగపాక : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మొల్లేటి శంకర్ అన్నారు. ఉమ్మలాడలో సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన వలంటీర్లతో కలిసి సర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అర్జీదారులు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందవచ్చన్నారు. గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇంటి వద్దకే అధికారులు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

నక్కపల్లి : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పెద బోదిగల్లం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో శనివారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు ఎస్‌వీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ డెంగ్యూ, వైరల్ జ్వరాలు, అతిసార వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి, అతిసార వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు.

లాలం సేవలు చిరస్మరణీయం

రాంబిల్లి : జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ భర్త లాలం భాస్కరరావు సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. రాంబిల్లిలో శనివారం లాలం భాస్కరరావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పల మాట్లాడుతూ, ఎంపీపీగా, సర్పంచ్‌గా లాలం భాస్కరరావు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగడ నాగేశ్వరరావు, దిన్‌బాబు, రంగనాయకులు పాల్గొన్నారు.

రైతు సంఘ సమావేశం నేడు

మునగపాక : మునగపాకలో ఆదివారం ఉదయం 10 గంటలకు రైతు సంఘ సమావేశం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక బైపాస్ రోడ్డులోని రాహుల్‌గాంధీ కల్యాణమండపంలో జరిగే సమావేశానికి రైతులు హాజరుకావాలన్నారు. మధ్యాహ్నం కల్యాణమండపం ప్రాంగణంలో వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రతి రైతు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని మహేష్ కోరారు.

పోషణ్ పక్వాడాతో మెరుగైన సేవలు

మునగపాక : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పిలుపునిచ్చారు. వాడ్రాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలింతలు, గర్భిణులకు ఆయన పోషకాహారాన్ని అందజేశారు. పోషణ్ పక్వాడ ద్వారా మెరుగైన సేవలందుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏటికొప్పాక విద్యార్థిని ఎంపిక



తేజస్వినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి : ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి దేవరపల్లి తేజస్విని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ శనివారం తెలిపారు. తేజస్విని పదో తరగతి ఫలితాల్లో 578మార్కులు సాధించి మండలంలో టాపర్ గా నిలిచిందన్నారు. ట్రిపుల్‌ఐటీకి తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం ప్రభుత్వ పాఠశాలల విజయమని ఆయన పేర్కొన్నారు. తేజస్వినిని జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైయస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, స్కూల్ కమిటీ చైర్మన్ దేవరపల్లి రమణ ఉపాధ్యాయుడు చీకట్ల రమణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పాయకరావుపేట : అరట్లకోట గ్రామ సచివాలయంలో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు సబ్ డివిజనల్ క్రైమ్ స్పాట్ సిబ్బంది ఏఎస్‌ఐ గోవిందరావు గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిశ యాప్, సీసీ కెమెరాల ఉపయోగం గురించి వివరించారు. దొంగసొత్తు కొనరాదని, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు చేరవేయాలని కోరారు. శ్రీ కార్తికేయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సైబర్ నేరాలు, స్త్రీలపై జరిగే నేరాల గురించి వివరించి అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించే ట్రోల్ ఫ్రీ నంబర్లు 100, 112 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇంచార్జ్ హెచ్‌సి కె.శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు, దేవంధర్, సర్పంచ్ అప్పలనర్స, కళాశాల ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.

తోటాడలో వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు



తోటాడలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సంధ్య

మునగపాక : వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేత్ర వైద్యాధికారి సంధ్య కోరారు. కంటి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటాడలో శనివారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కంటికి ఎటువంటి ఒత్తిడి కలిగించకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి ఆరు నెలల కొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. శిబిరాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు సందర్శించి సూచనలు,సలహాలు అందించారు.

తిమ్మరాజుపేట వాసికి డాక్టరేట్



భీమిశెట్టి ఉమాశంకర్

మునగపాక : తిమ్మరాజుపేటకు చెందిన భీమిశెట్టి ఉమాశంకర్‌కు డాక్టరేట్ లభించింది. ఆంధ్రా యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'మాస్ ట్రాన్స్‌ఫర్ ఇన్ త్రీఫేజ్ ఫ్లూయిడైజెడ్ బెడ్ ఇన్ ద ప్రెజెన్స్ ఆఫ్ హవర్ గ్లాస్ ప్రమోటర్' అనే పరిశోధనకు ఉమాశంకర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ఏయు వైస్ ఛాన్సలర్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, ప్రొఫెసర్లు డాక్టర్ జీవీఎస్ శర్మ, కేవీ రమేష్ తదితరులు ఉమాశంకర్‌కు అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా ఉమాశంకర్ తల్లి మంగలక్ష్మి ప్రస్తుతం తిమ్మరాజుపేట సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. తండ్రి కృష్ణారావు హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ చేశారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

- పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- పాఠశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన



కొర్లయ్యపేటలో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ప్రజల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో పాల్మన్‌పేట గ్రామ పంచాయతీ శివారు గ్రామాలైన కొర్లయ్యపేట, రాజయ్యపేట గ్రామాల్లో ఆయన శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పథకాలు రాని అర్హులు ఎవరైనా వుంటే గ్రామ సచివాలయ సిబ్బంది సమస్యలను నమోదు చేసుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం కొర్లయ్యపేట గ్రామంలో నాడు – నేడు పథకంలో రెండో విడతగా రూ.56 లక్షలతో అభివృద్ధి చేస్తున్న పాఠశాల భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజయ్యపేట గ్రామంలో రూ.12 లక్షలతో నాడు–నేడు పథకం రెండవ విడతగా అభివృద్ధి చేస్తున్న పాఠశాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులకు చేపల వేటకు వెళ్లడానికి అనువుగా సముద్ర తీరానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్లను గ్రామస్తులకు అందించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డికే పట్టం గట్టాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వై.సత్యనారాయణ, పాయకరావుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖాన్నా, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు జగతా శ్రీను, పల్లేల వెంకట్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామాల్లో సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేసినా కొందరికి సకాలంలో నిధులు అందలేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోందని, అటువంటివి వెంటనే సరిచేయాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి ఉచిత కుళాయి వేసే క్రమంలో వీధి రోడ్లు ధ్వంసం అయ్యాయని పలువురు సర్పంచ్‌లు తెలిపారు. అడ్డురోడ్డు నుంచి దార్లపూడి వరకు అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని చినగుమ్ములూరు సర్పంచ్ గాడి అప్పల నరసింహ కోరారు. వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి సౌజన్య, ఏపీఎం శివప్రసాద్, ఇరిగేషన్ ఏఈ చిన్నారావు, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, భూపతి అప్పారావు, కర్రి సత్యనారాయణ, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, దూళి శ్రీనుబాబు, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, బైపా శ్రీను, శానాపతి రాము పాల్గొన్నారు.

నేడు యానాద్రి అమ్మవారి పండగ



యానాద్రి అమ్మవారు

యలమంచిలి : అల్లూరి సీతారామరాజు కాలనీలో రైల్వే పట్టాల వద్ద వెలసియున్న యానాద్రమ్మ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిపించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ ఏటా ఆషాడమాసం మూడో వారంలో యానాద్రి అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. యానాద్రమ్మ అమ్మవారి పండుగ మహోత్సవానికి జిల్లా నలుమూలలు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద టెంట్లు, తాగునీటి సదుపాయం, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణ ఎస్ఐ కె .పాపినాయుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

కోటవురట్ల: అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. దీక్షలో గిరిజనులతో పాటు సీపీఎం నాయకుడు జి.డేవిడ్‌రాజ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ అణుకు గిరిజనులు సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రధానంగా గ్రామానికి రోడ్డు, పాఠశాల లేకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయారన్నారు.